సాక్షి
వికారాబాద్

గురువారం • 11 • మే • 2023



లక్షలు వెచ్చించారు..
పెద్దేముల్‌లో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 8లో ▸



ప్రొటోకాల్ రగడ
అధికారుల సమన్వలోపంతో ప్రొటోకాల్ రగడ నెలకొంది. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా చోటుచేసుకుంది. 8లో ▸



షరా మామూలే..!
వికారాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం ఎప్పటిలాగే ఎలాంటి చర్చ లేకుండా వాయిదా పడింది. 8లో ▸

న్యూస్‌రీల్

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన వికారాబాద్, తాండూరులో ఖాళీగా ఉన్న రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులను వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ పేర్కొన్నారు. అర్హులైన ఎంబీబీఎస్ డాక్టర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలనుకునే వారు ఈ నెల 16న ఉదయం 10:30 గంటల నుంచి అన్ని ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో హాజరు కావాలని తెలిపారు.

జిల్లాలో సదరం క్యాంపులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపులు నిర్వహిస్తారన్నారు. అర్హులైన వారు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 12న ఎంఆర్, ఎంఐ కేటగిరి, 22న ఓహెచ్, 25న ఎంఆర్, ఎంఐ, 26న హెచ్ఐ కేటగిరి వాళ్లకు క్యాంపు ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 280 మందికి అసెస్‌మెంట్ చేయడం జరుగుతుందన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి



వృద్ధులను కంటి శస్త్రచికిత్సలకు తీసుకెళ్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: మండల పరిధిలోని ప్రజలు కంటివెలుగు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్, ఆప్తమాలజిస్ట్ జవహర్‌లు అన్నారు. బుధవారం మండల పరిధిలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాలలో సర్జరీలు అవసరమైన 26 మందిని నగరంలోని పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు. వారు మాట్లాడుతూ.. ఇప్పటివరకు మండల పరిధిలో 79మందికి శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ అసిస్టెంట్ ప్రశాంతి,సిబ్బంది నవీన్, సీరాజ్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాల్సిందే



సమ్మెలో పాల్గొన్న జేపీఎస్, ఓపీఎస్‌లు

అనంతగిరి: జేపీఎస్, ఓపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని పలువురు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట 13 రోజులుగా జేపీఎస్‌ల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. తమది న్యాయమైన పోరాటమని వారన్నారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన జేపీఎస్, ఓపీఎస్‌లు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సర్చ్



కార్డెన్ సర్చ్ అనంతరం ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

నవాబుపేట: శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామంలో రాత్రి కార్డెన్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలోని పలు ఇళ్లల్లో సోదాలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను, అనుమానిత వస్తువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డెన్ సర్చ్‌లో ఎలాంటి ధ్రువపత్రాలు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశం, ఎస్ఐ భరత్ భూషణ్, సర్పంచ్ రఫీ తదితరులు ఉన్నారు.

చదువులు అట్టడుగున..



పది ఫలితాల్లో జిల్లా చివరి స్థానం
- హాజరైన విద్యార్థులు: 13, 399
- ఉత్తీర్ణులైన వారిసంఖ్య: 7,967
- ఫెయిల్ అయిన వారు: 5,432
- ఉత్తీర్ణతా శాతం: 59.46
- జిల్లా వ్యాప్తంగా 32 మంది విద్యార్థులకు 10 జీపీఏ
- 83.25 శాతం ఉత్తీర్ణతతో చౌడాపూర్ మండలం బెస్ట్
- 21.61 శాతం ఉత్తీర్ణతతో మర్పల్లి లాస్ట్

వికారాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు నిరాశపరిచాయి. జిల్లా చివరి స్థానంలో నిలిచింది. పరీక్షల సమయంలో పేపర్ లీకేజీ వ్యవహారంతో వార్తల్లోకెక్కిన జిల్లా.. ఫలితాల్లోనూ చివరి స్థానంలో నిలవడంతో మరో సారి వార్తల్లోకెక్కినట్టయ్యింది. జిల్లాకు 33వ స్థానం దక్కటంతో గత ఏడాదిలో ఉన్న 24వ స్థానం నుంచి చివరి స్థానానికి పడిపోయింది. గతేడాది 40 పాఠశాలల్లో వంద శాతం రిజల్ట్ రాగా ఈసారి మూడు పాఠశాలల్లో (ప్రైవేటు) మాత్రమే వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. విద్యాశాఖ మంత్రి జిల్లా మంత్రిగా ఉన్న వికారాబాద్‌లో ఇలాంటి ఫలితాలు రావడం చర్చనీయాంశమైంది. అయితే మొత్తం జిల్లాలో ఆయా ప్రభుత్వ, ప్రైవేటు 13 పాఠశాలలకు చెందిన 32 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారు.

59.46 శాతం ఉత్తీర్ణత...

బుధవారం విద్యాశాఖ ఫలితాలు విడుదల చేసింది. జిల్లాలోని 19 మండలాల నుంచి మొత్తం 13,399 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 7,967 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన వారిలో 5,432 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. 59.46 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అయితే పరీక్షల సమయంలో పేపర్ లీకేజీ కారణంగా పోలీసులు, ఆయా శాఖల అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. మొదటి సారి పోలీసుల చేత విద్యార్థులను చెక్ చేయించారు. నిరంతరం ఆందోళనకర పరిస్థితులు కనిపించాయి. ఇలా స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాయలేకపోవటం కూడా విద్యార్థుల ఫలితాలపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది.

ఆ మూడు పాఠశాలల్లో..

చౌడాపూర్ మండలం 83.25 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో మొదటి స్థానంలో నిలవగా 21.61 శాతం ఉత్తీర్ణతతో మర్పల్లి మండలం చివరి స్థానంలో నిలిచింది. బీసీ గురుకుల పాఠశాలలు నవాబుపేట, యాలాల, వికారాబాద్‌లోని బృంగి స్కూల్, న్యూ నాగార్జున, బాలికల గురుకుల పాఠశాల, ప్రవిడెన్స్ స్కూల్ కొడంగల్, బాలికల గురుకుల పాఠశాల తాండూరు, డెఫడిల్స్ స్కూల్ పరిగి పాఠశాలల్లో ఒకరు చొప్పున పదికి పది జీపీఏ పాయింట్లు సాధించారు. కేటీఎస్ తాండూరు, సిద్ధార్థ స్కూల్ వికారాబాద్‌లలో ఇద్దరు చొప్పున పదికి పది జీపీఏ సాధించారు. పరిగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ముగ్గురికి పది జీపీఏ వచ్చింది. వికారాబాద్ నారాయణ స్కూల్‌లో ఐదుగురు, వికారాబాద్ శ్రీచైతన్య స్కూల్‌లో 12 మంది విద్యార్థులకు పదికి పది జీపీఏ పాయింట్లు వచ్చాయి. తాండూరుకు చెందిన మార్నింగ్ స్టార్ స్కూల్, శ్రీ సాయి మేధా విద్యాలయ, పరిగికి చెందిన బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

ఆశించిన ఫలితాలు రాలే..



గత సంవత్సరం కంటే రాష్ట్ర వ్యాప్తంగా ఫలితాల శాతం పడిపోయింది. తాము ఆశించిన ఫలితాలు రాలేదు. ఉపాధ్యాయులు కష్టపడినప్పటికీ ఫలితాలు నిరాశపరిచాయి. ఈ ఫలితాలను బేరీజు వేసుకొని సప్లిమెంటరీలో వందశాతం ఫలితాల కోసం కార్యాచరణ రూపొందిస్తాం. ఏయే సబ్జెక్టులలో, ఏయే పాఠశాలల్లో తక్కువ ఫలితాలు వచ్చాయో సమీక్షించుకొని సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే వారికోసం ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించాలని యోచిస్తున్నాం. ఉత్తీర్ణులైన వారందరికీ అభినందనలు.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి



మైల్వార్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆరబెట్టిన ధాన్యమే తీసుకురండి

- మట్టిపెల్లలు, గడ్డి లేకుండా శుద్ధిచేయండి
- రైతులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచన
- మైల్వార్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ

బషీరాబాద్: ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కలెక్టర్ నారాయణరెడ్డి రైతులకు సూచించారు. ధాన్యంలో మట్టి పెల్లలు, గడ్డి లేకుండా శుద్ధి చేసి తీసుకురావాలన్నారు. బుధవారం మండలపరిధిలోని మైల్వార్, బషీరాబాద్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మైల్వార్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పీఏసీఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ 17 శాతం కంటే తక్కువగా ఉండాలని, బస్తాకు 41 కిలోలు మాత్రమే తూకం వేయాలని ఆదేశించారు. సేకరించిన ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. గర్భిణులకు పౌష్టిక ఆహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. మైల్వార్, బషీరాబాద్ గ్రామాల్లో శ్మశానవాటికలు, పల్లెప్రకృతి వనాలు పరిశీలించారు. బషీరాబాద్‌లోని పల్లెప్రకృతి వనం బాగుందని సర్పంచ్ ప్రయాంకను అభినందించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వాటి మరమ్మతులకు రూ.3 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారు. అలాగే రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఏమైన సమస్యలు ఉన్నాయా? తహసీల్దార్ కార్యాలయంలో పనులు అవుతున్నాయా? అని ఆరా తీశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. మొక్కలు ఎండకుండా పంచాయతీలు ఎప్పటికప్పుడు నీటిని అందిస్తూ పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, తహసీల్దార్ వెంకట స్వామి, డిప్యూటీ తహసీల్దార్ వీరేస్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గౌతాపూర్‌లో భూ వివాదం



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రైతులు

- ఇరువర్గాల ఘర్షణ
- పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని బుధవారం గౌతాపూర్‌లో భూ వివాదం చోటు చేసుకుంది. ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఇరు వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. గ్రామంలో 249 సర్వే నంబర్‌కు సంబంధించి బోయిని బిచ్చప్ప తాండూరు పట్టణానికి చెందిన అబ్దుల్ ఖయ్యుం ఆద్మీకి భూమిని విక్రయించారు. అబ్దుల్ కొందరికి అగ్రిమెంట్ చేశారు. వారు ఆ భూమిలో జేసీబీతో చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గౌతాపూర్ గ్రామానికి చెందిన కొంపలి లక్ష్మప్ప, రాములు కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తమ భూమిలోకి చొర బడుతున్నారని జేసీబీ డ్రైవర్‌తో పాటు మరికొందరిని అడ్డగించారు. అయితే ఈ భూమిని 2011లో కొనుగోలు చేశామని షేక్ ఫయాజ్, ఇబ్రహీంలు తమ వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ దస్త్రాలు చూపించారు. ఈ విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ దాడిలో కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిని వివరణ అడగ్గా.. ఇరువర్గాలు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారని పూర్తి విచారణ అనంతరం కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ఐకేపీ వీఓఏలు కోరారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను కలిసి సమస్యలు వివరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీఇచ్చారు.

– అనంతగిరి



ఎమ్మెల్యే ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

‘ఆరుబయట’కు వెళ్లొద్దు



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కృష్ణన్

- వందశాతం మరుగుదొడ్లు వినియోగించాలి
- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి కృష్ణన్

మోమిన్‌పేట: ప్రతి గ్రామంలో వంద శాతం మరుగుదొడ్లు వినియోగంలో ఉండాలని, ఎవరూ ఆరుబయటకు వెళ్లొద్దని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి కృష్ణన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇప్పటికే వంద శాతం మరుగుదొడ్లు నిర్మించినా ఇంకా అక్కడక్కడా ‘ఆరుబయటకు’ వెళ్తున్నారని అన్నారు. నిర్మించుకొన్న మరుగుదొడ్లను వంద శాతం వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రతను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. ఇంకుడు గుంతలు నిర్మించుకొని మురుగును కట్టడి చేయాలని సూచించారు. వర్షాకాలంలో మొక్కలను నాటేందుకు నర్సరీలలో మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. ఖాళీ ప్యాకెట్లలో మునగ విత్తనాలను వేయాలన్నారు. మొక్కల ఎదుగుదలకు డీఏపీ ఎరువులను ఉపయోగించాలన్నారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కంపోస్టు షెడ్డులలో సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించారు. ఆదర్శగ్రామాలుగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.

ఎస్‌బీఎం కో ఆర్డినేటరుపై ఆగ్రహం

గ్రామాలలో అవసరమైన వారికి మరుగుదొడ్లు నిర్మించాలని,ఇప్పటికే మహిళా సంఘం సభ్యులతో మాట్లాడాలని సూచించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్‌బీఎం కోఆర్డినేటరు లక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో మరుగుదొడ్లను వినియోగించడం లేదన్నారు. మహిళ సంఘ సభ్యులతో మాట్లాడి అవగాహన కల్పించాలన్నారు. ఇంకుడు గుంతలను నిర్మించేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం మోమిన్‌పేటలో సమీక్ష సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి,సర్పంచ్ అంతమ్మ,ఎంపీఓ యాదగిరి,కార్యదర్శి తిరుపతమ్మ,ఏపీఓ శంకర్, ఫీల్డ్‌అసిస్టెంట్ అడివిరెడ్డి, డీపీఎం శ్రీనివాస్, ఈసీ వికాస్,ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలాలతో మతోన్మాదాన్ని తరిమికొడదాం

- తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరిశంకర్
- అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రారంభం



అనంత సాహిత్య సంఘం లోగోను ఆవిష్కరిస్తున్న గౌరిశంకర్, కవులు

అనంతగిరి: మతం చిచ్చును రగిలించే శక్తులను తిప్పికొట్టడానికి సాహిత్య సాంస్కృతిక రంగాలు కలిసికట్టుగా ముందుకుసాగాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరిశంకర్ అన్నారు. మతసామరస్యాన్ని, లౌకికత్వాన్ని ప్రబోధించే సాహిత్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతగిరి గుట్టలోని అనంతపద్మనాభ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన జిల్లా కవులు రచయితల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అనంత సాహిత్య సాంస్కృతిక వేదికను ప్రారంభించారు. అనంత సాహిత్య సంఘం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత ఘర్షణలకు తావులేని తెలంగాణ చరిత్రను చెక్కు చెదరకుండా కాపాడాల్సిన బాధ్యత సాహిత్య రంగంపై ఉందన్నారు. సాయుధ పోరాటం ఒక మతానికో కొన్ని కులాలకో వ్యతిరేకంగా జరిగిన పోరు కాదని స్పష్టం చేశారు. సాయుధ పోరాటాన్ని మతానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరించడం తగదన్నారు. ప్రజల ఐకమత్యాన్ని కోరుకునే సాహితీవేత్తలు, రచయితలు మతోన్మాదాన్ని దునుమాడేవిదంగా విస్తృతంగా రచనలు చేయాలన్నారు. అన్యాయాలు, అక్రమాలు, అణచివేతలు ఎక్కడ ఉన్నా వాటిపై తొలిగా గొంతు విప్పి స్పందించి నిలిచేది కవులు, రచయితలు, కళాకారులేనని గుర్తుచేశారు. తెలంగాణ కవులు సోక్రటీసు వారసులని, ఆనాటి సాయుధ పోరాటంలో, తొలి, మలి దశ రాష్ట్ర సాధన ఉద్యమాల్లో మహోన్నత పాత్రను పోషించారని చెప్పారు. దేశాన్ని కమ్మేస్తున్న మతతత్వభూతాన్ని తరిమి కొట్టడంలో కూడా కవులు, సాహితీవేత్తలు అగ్రభాగాన నిలిచి తీరుతారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

జిల్లా చరిత్ర చాటిచెప్పాలి

కవులు, రచయితల ఐక్యతాభావం గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అభినందించారు. జిల్లా చరిత్రను జిల్లా సాంస్కృతిక కళా నైపుణ్యతను కవులు, కళాకారులు చాటి చెప్పాలని అన్నారు. ఈ పని చేయడానికి ముందుకు వచ్చిన అనంత సాహిత్య అకాడమీ సంస్థకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న రాష్ట్ర స్థాయి కవులు, సాహితి వేత్తలను సన్మానించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కార తొలి గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్.జె.చెన్నయ్య, ఓయూ పూర్వాచార్యులు బాగయ్య, కవి నర్సింహులు గుప్తా, ప్రముఖ కథా రచయిత దొరవేటి తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు.

అనంతుని సేవలో గౌరీశంకర్

రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తీర్థప్రసాదాలు అందజేసి ఆలయం తరుపున ఘనంగా సన్మానించారు.

విద్యార్థులతో ముఖాముఖి



విద్యార్థులతో మాట్లాడుతున్న జూలూరి గౌరిశంకర్

వికారాబాద్ అర్బన్: డిగ్రీ చదువుతున్న విద్యార్థులతో గ్రామాల చరిత్ర రాయించడం అద్వితీయమైనదని సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరిశంకర్ అన్నారు. బుధవారం ఆయన వికారాబాద్‌లోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలను సందర్శించి మన ఊరు మనచరిత్ర కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. గ్రామా చరిత్రను ఎలా సేకరించాలి? ఎలా రాయాలి? అనే అనేక విషయాలను విద్యార్థులకు వివరించారు. గ్రామాల్లో సామాజిక స్థితిగతులను ఉన్నది ఉన్నట్లుగా రాయాలన్నారు. రాష్ట్ర అవతరణకు ముందు తరువాత పల్లెలు ఎలా ఉన్నాయనే దానిపై రాయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మల్లయ్య, అధ్యాపకులు నర్సింహారెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణ: పలువురికి తీవ్ర గాయాలు



కర్రలు, రాళ్లతో దాడులు చేసుకుంటున్న ఇరువర్గాల ప్రజలు

కుల్కచర్ల: భూమి విషయంలో దాయాదుల మధ్య గొడవ జరిగింది. ఐదు మంది గాయపడ్డారు. ఈ సంఘటన చౌడాపూర్ మండలం మల్కాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ పరిధిలోని సర్వే నంబరు 99లో రెండు ఎకరాల పొలం విషయంలో దాయాదుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాల వారు కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న నవాపేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని వివరాలు సేకరిస్తున్నారు.

బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తికి రిమాండ్

పరిగి: బాలికను ఎత్తుకెళ్లిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నజీరాబాద్ తండాకు చెందిన 16సంవత్సరాల బాలిక ఈ నెల 6న పరిగిలో కంప్యూటర్ నేర్చుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు తండాకు చెందిన నేనావత్ సునీల్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు ముంబాయిలో ఉన్నట్టు గుర్తించి పోలీసులు బుధవారం అక్కడి నుంచి తీసుకొచ్చారు. కేసు నమోదు చేసి నేనావత్ సునీల్‌ని రిమాండ్‌కు తరలించారు.

భార్య రాలేదని బావిలో దూకి ఆత్మహత్య



జనార్దన్(ఫైల్)

మోమిన్‌పేట: పుట్టింటికి వెళ్లిన భార్య రాలేదని మనస్తాపం చెందిన భర్త బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మోమిన్‌పేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ కథనం మేరకు.. మోమిన్‌పేటకు చెందిన జనార్దన్(35), సంధ్య దంపతులు. వారికి కొడుకు, కూతురు ఉంది. ఆరు నెలలుగా గొడవ పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం మద్యం మత్తులో జనార్దన్ భార్య సంధ్యను కొట్టాడు. దీంతో ఆమె మర్పల్లి మండలం పంచలింగాల్‌లోని తల్లి ఇంటికి వెళ్లింది. మంగళవారం జనార్దన్ భార్య ఊరికి వెళ్లి అక్కడి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



నర్సింలు(ఫైల్)

కుల్కచర్ల: చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది.
ఎస్‌ఐ గిరి కథనం మేరకు.. అంతారం గ్రామానికి చెందిన కే నర్సింలు(39) మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం తెల్లవారుజామున ఎత్తుకాల్వ తండా శివారులో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య జయంతి తన భర్త చావుపై అనుమానం ఉన్నట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వివరాలు సేకరించారు.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

- నిరుపయోగంగా పెద్దేముల్ బస్టాండ్
- ఒక్క బస్సు ఆగితే ఒట్టు
- తాగుబోతులకు అడ్డాగా..
- జాడలేని ఆర్టీసీ అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



వినియోగంలో లేని పెద్దేముల్ బస్టాండ్

పెద్దేముల్: మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడం, పట్టించుకునే వారు లేకపోవడంతో తాగుబోతులకు అడ్డాగా మారింది. అంతేకాకుండా బస్టాండ్ పరిసరాల్లో కలుప నింపి కబ్జాకు పాల్పడుతున్నారు. అయినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని స్థానికులు మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో బస్టాండ్ ఆవరణ ముళ్లపొదలతో నిండిపోయింది. ఇదే అదనుగా భావించిన కొంత మంది ఆకతాయిలు మద్యం సేవించేందుకు అడ్డాగా మార్చుకున్నారు. మండల కేంద్రంలోని తాండూరు – సంగారెడ్డి ప్రధాన రహదారిపై బస్టాండ్ ఉన్నా ఒక్క బస్సు కూడా లోనికి వెళ్లడం లేదు. మహేందర్‌రెడ్డి రవాణా శాఖ మంత్రి ఉన్న సమయంలో ఆర్టీసీ అధికారులతో చర్చించి బస్టాండ్‌లో బస్సులు నిలిచేలా చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత బస్సులు మళ్లీ నిలవడం లేదు. నాలుగేళ్ల క్రితం రూ. 15లక్షలు వరకు ఖర్చు చేసి బస్టాండ్‌కు ప్రహరీ, సీసీ రోడ్డు వేశారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. నిత్యం సంగారెడ్డి, వికారాబాద్, నాగులపల్లి, జహీరాబాద్, కోటపల్లి, కోహీర్ ప్రాంతాలతో పాటు పలు గ్రామాలకు వంద వరకు బస్సులు నడుస్తున్నాయి. కానీ ఒక్క బస్సు కూడా బస్టాండ్‌లోకి రావడం లేదు.

అధికారుల నిర్లక్ష్యం



పెద్దేముల్ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చూడాలని పలు మార్లు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. దీంతో బస్టాండ్ నిరుపయోగంగా మారింది. పిచ్చి మొక్కలతో చిన్నపాటి అడవిని తలపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నర్సింలు, హన్మాపూర్

బస్సు నిలిచేలా చూడాలి



తాండూరు – సంగారెడ్డి మార్గంలో నడిచే ప్రతి బస్సు పెద్దేముల్ బస్టాండ్‌లో నిలిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఆర్టీసీ అధికారులు కంట్రోలర్‌ను నియమించి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చూడాలి.

– వెంకటయ్య, మాజీ సర్పంచ్, బుద్దారం

చర్యలు తీసుకుంటాం

బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. అలాగే ఆర్టీసీ స్థలం కబ్జా కాకుండా చూస్తాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు కూడా సహకరించాలి.

– సమత, ఆర్టీసీ డీఎం, తాండూరు



దోమలో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఎంపీపీ లేకుండానే కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నేతలు

ప్రొటోకాల్ రగడ

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి ఎంపీపీకి అందని ఆహ్వానం

దోమ: అధికారుల సమన్వయలోపం కారణంగా ప్రొటోకాల్ రగడ రచ్చకెక్కింది. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. బుధవారం దోమ మండల కేంద్రంతో పాటు దాదాపూర్, గుండాల గ్రామాలలో డీసీఎమ్మెస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అనసూయను ఆహ్వానించలేదు. దీంతో అధికారుల తీరుపై ఎంపీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఒక మండల పరిషత్ అధ్యక్షురాలినని, అయినా అధికారులు తనపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ ఏ ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానం అందించడం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తనకు ఆహ్వానం పంపకుండా జెడ్పీటీసీతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రూ. 1.50కోట్లతో అదనపు గదులు

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఆహార పదార్థాలను రుచి చూస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన ఫుడ్ ఫెస్టివల్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. 41 రకాల ఆహార పదార్థాలతో 15రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ప్రతి స్టాల్‌ను సందర్శించి అన్ని రకాల పదార్థాలను రుచి చూశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 1.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులను ప్రారంభిస్తామని చెప్పారు. విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, ఫుడ్ ఫెస్టివల్ నిర్వాహకులు డాక్టర్ ఆఫ్రీన్, షరీఫా పాల్గొన్నారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు



గాయపడిన మహిళను పోలీసు వాహనంలో ఎక్కిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

ధారూరు: వికారాబాద్ నుంచి తాండూరు వెళుతున్న ఆటో ధారూరు గ్రామ సమీపం ఒంటిమామిడి మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఇదే మార్గంలో వెళుతున్న మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్ బోల్తాపడిన ఆటోలోంచి క్షతగ్రాతులను బయటకు తీసి పోలీసులు, 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్, ఏఎస్‌ఐ మురళి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్న క్షతగాత్రులను పోలీసు వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ తోపాటు వికారాబాద్‌కు చెందిన బోవమ్మ, పుష్ప, పద్మమ్మ, ఓబాబు, అఖిల్ గాయపడ్డారు. బోవమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు.

శభాష్.. సాత్విక, సాయినిఖిత



విద్యార్థులను సన్మానించిన లక్ష్మీనర్సింహారెడ్డి

ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థినులకు సన్మానం

కడ్తాల్: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్(పటాన్‌చెరువు, హయత్‌నగర్)కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసించి అత్యుత్తమ మార్కులు సాధించిన, కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన సాత్విక (467/470), సాయినిఖిత (458/470)ను బుధవారం ఘనంగా సన్మానించారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాత్విక, సాయినిఖితతో పాటు వారి తల్లిదండ్రులను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆంజనేయులు, సంతోష, చిట్టెమ్మ, రవి, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, ఉపసర్పంచ్ రామకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, కార్యదర్శి రాఘవేందర్ ఉన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వ కృషి భేష్



మహిళా సంఘాల సభ్యులతో ఉత్తరప్రదేశ్ బ్యాంకు అధికారులు

ఉత్తరప్రదేశ్ బ్యాంక్ అధికారుల కితాబు

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలో మహిళాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు భేషుగ్గా ఉన్నాయని ఉత్తరప్రదేశ్ బ్యాంక్ అధికారులు కితాబిచ్చారు. బుధవారం ఎన్‌ఐఆర్‌డీ శిక్షణలో భాగంగా డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ బ్యాంక్ అధికారుల బృందం సభ్యులు ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామాన్ని సందర్శించారు. మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలతో ఏర్పాటు చేసుకున్న కుటీర పరిశ్రమలు, రుణాల చెల్లింపుల గురించి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి నప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్లు స్వర్ణలత, బాల్‌రాజ్, నర్సింహ, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి చంద్రమణి, ఏపీఎం నగేష్ పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా శేఖర్



శేఖర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పులిమామిడికి చెందిన ఏ శేఖర్ నియమితులయ్యారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీ నర్సింహారెడ్డి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, దళిత మోర్చా జిల్లా నాయకుడు రాములు, పార్టీ జిల్లా నాయకుడు సత్తిరెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి, మండల కార్యదర్శి రఘునందన్, నర్సింహ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

షరా మామూలే..!

- ఎలాంటి చర్చ లేకుండానే వాయిదా పడిన మున్సిపల్ సమావేశం
- ఎజెండాలోని పలు అంశాలను వ్యతిరేకించిన అధికార పార్టీ కౌన్సిలర్లు
- అందరికీ చెప్పే ఎజెండా తయారు చేశాం: చైర్‌పర్సన్ మంజుల



చైర్‌పర్సన్‌కు నోటీసు ఇస్తున్న అధికార పార్టీ కౌన్సిలర్లు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ సాధారణ సమావేశం ఎప్పటిలాగే ఎలాంటి చర్చ లేకుండా వాయిదా పడింది. అధికార బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎజెండాలోని పలు అంశాలను వ్యతిరేకిస్తూ చైర్‌పర్సన్‌కు లేఖ ఇవ్వడంతో ఎలాంటి చర్చ లేకుండానే సమావేశాన్ని వాయిదా వేశారు. వికారాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం ప్రారంభమైంది. అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే 18మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎజెండాలోని 1 నుంచి 37 అంశాలను వ్యతిరేకిస్తూ చైర్‌పర్సన్‌కు లేఖ ఇచ్చి బయటకు వెళ్లి పోయారు. అంశాల వారీగా చర్చ జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని చైర్‌పర్సన్ చెప్పినా కౌన్సిలర్లు వినిపించుకోలేదు. దీంతో చేసేదేమీ లేక సమావేశాన్ని వాయిదా వేశారు.

అందరి ఆమోదంతోనే ఎజెండా

అందరు కౌన్సిలర్ల ఆమోదంతోనే ఎజెండా తయారు చేసినట్లు చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. సమావేశం అనంతరం ఆమె వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 15 ఆర్థిక సంఘం నుంచి వికారాబాద్ మున్సిపాలిటీకి రూ. 1.48 కోట్లు వచ్చినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ఈ నిధులను సీసీ రోడ్లకు వినియోగించరాదని తెలిపారు. అత్యవసర సేవలు శానిటేషన్, మంచినీటి సరఫరా, వాహనాల మరమ్మతులకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా 33 వార్డుకు ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈని పంపి అక్కడ నెలకొన్న సమస్యలను కౌన్సిలర్ల ద్వారా తెలుసుకున్నట్లు తెలిపారు. వారి సూచనల మేరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎజెండాను కూడా మూడు రోజుల ముందే కౌన్సిలర్లకు అందజేయడం జరిగిందన్నారు. అయినా వారు పలు అంశాలను వ్యతిరేకిస్తున్నట్లు లేఖ ఇవ్వడం సరి కాదన్నారు. సమావేశం సాఫీగా జరగరాదనే కొందరు కౌన్సిలర్లపై ఒత్తిడి తెచ్చి లేఖ ఇప్పించారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఇష్టం లేకుండా లేఖలో సంతకం చేసినట్లు కొంత మంది కౌన్సిలర్లు తనతో చెప్పినట్లు చైర్‌పర్సన్ వివరించారు.

కౌన్సిల్ తీరుపై అసహనం

రెండేళ్లుగా మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గానీ, బడ్జెట్ సమావేశం గానీ సక్రమంగా జరగలేదు. ప్రతి సారీ పాలకవర్గం సమావేశానికి రావడం.. ఐదు నిమిషాల్లోనే బాయ్‌కాట్ చేసి వెళ్లి పోవడం పరిపాటిగా మారింది. అధికార బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కూడా పట్టణ సమస్యలపై గంట సేపు కూడా చర్చించక పోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టింపులకు పోయి సమస్యలను గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో కొన్ని నెలలుగా మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. వాహనాలు చెడిపోయి చెత్త సేకరించడం కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాకుండానే వాయిదా వేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాతరలో ఘర్షణ

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్‌లో వెలసిన రేణుక ఎల్లమ్మ జాతరలో ఘర్షణ చోటు చేసుకుంది. మంగళవారం కరన్‌కోట్ గ్రామానికి చెందిన యువకులు కోత్లాపూర్ యువకులతో గొడవపడ్డారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇరువురిని సముదాయించారు. అయినా వినకుండా ఘర్షణ పడ్డారు. ఈ గొడవ కాస్త పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

'కంటి వెలుగు' నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంపై నిర్లక్ష్యం వహించరాదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సిబ్బందికి సూచించారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని జయలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంధత్వ నివారణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో 18ఏళ్ల పైబడిన వారు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. దృష్టి లోపం ఉన్న వారికి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉన్న వారికి హైదరాబాద్‌లోని సరోజినీ ఆస్పత్రికి రెఫర్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్‌బాబు, ఎంఈఓ కృష్ణ, డాక్టర్ హరికిషన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓ చిట్టిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

శంకర్‌పల్లి: విద్యుత్ షాక్‌తో బుధవారం గేదె మృతి చెందింది. మండలంలోని టంగటూరుకు చెందిన అడివయ్య తన గేదును పొలం వద్ద కట్టేశాడు. మధ్యాహ్నం వీచిన గాలులకు విద్యుత్ తీగలు తెగి పడడంతో గేదె మృతి చెందింది. సుమారు లక్ష రూపాయలు నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు.

నీవు లేకున్నా..

నిన్ను మరువదు ఈ పాఠశాల..

- ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థి మృతి
- పదో తరగతి ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా హనన్య విజ్ఞాన్



విజ్ఞాన్ (ఫైల్)

కందుకూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఓ విద్యార్థి పదో తరగతి ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లేమూరు గ్రామానికి చెందిన డేవిడ్ కుమారుడు హనన్య విజ్ఞాన్ అదే గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. ఏప్రిల్ 20న లేమూరు – గూడూరు చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ అదే రాత్రి చనిపోయాడు. కాగా బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 9 జీపీఏ మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. దీంతో గ్రామస్తులు, తోటి విద్యార్థులు హనన్య విజ్ఞాన్‌ను గుర్తు చేసుకొని కంటతడి పెట్టారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవ వేడుకలు, బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య బాజాభజంత్రీలు మేళాతాళాలు చప్పుళ్లతో ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రధాన కూడలి మీదుగా ఊరేగించి, లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణం వద్దకు తీసుకువెళ్లారు. విగ్రహాలకు జలధివాసం, ధాన్యధివాసము, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అఖండదీపారధన, మంగళారతి, అంకురార్పణ, అభిషేకం, యాగశాల ప్రవేశం, దేవతాహ్వానం, తీర్థప్రసాదగోష్టి, తదితర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేశ్, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, ఉపసర్పంచ్ అనిల్, అశోక్, బుచ్చిబాబు, గోపాల్, శ్రీశైలం, ఈశ్వర్, బాస్కర్, అనిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడిగా జగన్



జగన్‌గౌడ్

ఆమనగల్లు: సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యునిగా మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన జగన్‌గౌడ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కొన్నేళ్లుగా ప్రైవేటు ఆస్పత్రుల బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జగన్ బాధితుల పక్షాన అనేక పోరాటాలు చేశారు. ఇటీవల న్యాయవాద కోర్సు పూర్తి చేసిన ఆయన తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు కాగా, ప్రస్తుతం సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యునిగా నియమితులయ్యారు. పేదల పక్షాన ఉంటానని జగన్‌గౌడ్ అన్నారు.